29 OCT 2019.

# అరకొర ఏర్పాట్లపై భక్తుల అసంతృప్తి

**యానాం, అక్టోబరు 28:** నియోజకవర్గంలో నేటి నుంచి కార్తీకమాసం సందడి మొదలుకానుంది. ఈ సందర్భంగా పుష్కర ఘాట్ల వద్ద యానాం అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యానాంలో సదుపాయాలు బాగుంటాయనే ఉద్ధేశంతో ప్రతి ఏటా పరిసర ప్రాంతాల భక్తులు ఫెర్రి రోడ్డులోని గౌతమి గోదావరిలో స్నానాలను చేసేందుకు వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. అదే విధంగా పుష్కర్ ఘాట్‌లో పేరుకు పోయిన సిల్టుతో అస్తవ్యస్తంగా ఉంది. పోటు సమయంలో దాని ప్రభావం పెద్దగా కనిపించకపోయినా పాటు సమయంలో సిల్టు దర్శనమివ్వనుంది. దీన్ని తొలగిస్తే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



మట్టితో నిండి ఉన్న పుష్కర్‌ఘాట్

## ఆనందోత్సాహాలతో దీపావళి

**యానాం, అక్టోబరు 28:** నియోజకవర్గంలో దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లక్ష్మీదేవికి పూజలు చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి పలువురు బాణసంచా కాల్చేందుకు విముఖత చూపినట్లు తెలిసింది. పలుచోట్ల చిన్నారులు, యువకులు టపాసులు కాలుస్తూ సందడి చేశారు.



యానాంలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

## విజిలెన్స్ వారోత్సవాలు

**యానాం, అక్టోబరు 28:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) యానాం శాఖ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా మూమెంట్ కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహించారు. యానాంశాఖ ఇన్‌చార్జ్ లింగేశ్వరరావు నేతృత్వంలో జరిగిన కోచ్‌లు, విద్యార్థులు హాజరయ్యారు. సోమవారం నుంచి నవంబరు 2వ తేది వరకు నిర్వహించనున్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేలా యానాం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యానాం శాయ్ కోచ్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

29 OCT 2019



యానాంలో ఓ ఇంటివద్ద కాకరపువ్వొత్తులు వెలిగిస్తున్న బాలలు

**యానాం :** దీపావళి పండుగను యానాంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. నియోజకవర్గంలో బాణసంచా విక్రయాలకు 31 మందికి ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేయడంతో ఆదివారం పొద్దుపోయే వరకు అమ్మకాలు జోరుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బాణసంచా కొనుగోలు చేసుకువెళ్లారు. యానాంలో తమిళులు ఉదయమే దీపావళి జరిపారు. మిగిలిన వారంతా సాయంత్రం లక్ష్మీపూజ చేసి, పండుగ నిర్వహించారు.



యానాం వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు

## విజిలెన్స్ అవగాహన ర్యాలీ

యానాం, న్యూస్‌టుడే : అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు దేశవ్యాప్తంగా చేపడుతున్న విజిలెన్స్ అవగాహన వారాన్ని సోమవారం యానాంలో నిర్వహించారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం విభాగం ఆధ్వర్యంలో స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల్లో సాగింది. ఈ సందర్భంగా క్రీడాకారులు అవినీతిని వ్యతిరేకించాలంటూ నినాదాలు చేశారు.

## నేటి నుంచి రోజూ శివాలయంలో రుద్రాభిషేకం

యానాం : కార్తిక మాసం సందర్భంగా స్థానిక శివాలయంలో రోజూ ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్ తెలిపారు. గౌతమి గోదావరి పుష్కరస్నాన ఘట్టంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఆలయాన్ని సందర్శించే భక్తులు ఈ రుద్రాభిషేకాన్ని తిలకించ వచ్చన్నారు.

29 OCT 2019.

## నవోదయలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెట్టకూరు (యానాం): జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతికి సంబంధించి 2020-21 విద్యాసంవత్సరానికి ఖాళీగా ఉన్న 19 సీట్ల భర్తీకి ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం. అనురాధ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో డిసెంబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

2 9 OCT 2019

# విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు...

- యానాంలో 215 మంది ఉపాధ్యాయులకు 'నిష్ఠా' శిక్షణ
- పిల్లల్లో విమర్శనాత్మక ఆలోచనా విధానం పెంపు లక్ష్యం
- నూతన బోధనా పద్ధతులు, విద్యార్థి కేంద్రంగా అభ్యసనం



నిష్ఠా శిక్షణలో ఉపాధ్యాయుల తయారుచేసిన బోధనోపకరణాలు



నిష్ఠా శిక్షణను ప్రారంభించిన పుదుచ్చేరి ఆరోగ్య మంత్రి మల్లాడి (ఫైల్)

యానాం: పిల్లలూ...భూమి గుండ్రంగా తిరుగుతుందని తెలుసుకున్నాం కదా.. మరి మనం ఎందుకు కిందకి పడిపోవడం లేదు? అనే ఉపాధ్యాయుడి ప్రశ్న పిల్లవాడ్ని విమర్శనాత్మకంగా ఆలోచించేటట్లు చేస్తుంది. ఆ విధమైన ఆలోచనా ధోరణిని కలగడానికి పిల్లవాడికి వేసే ప్రశ్నలు సైతం ఆ బోధనా పద్ధతిలో ఉండాలి. తొలుత ఉపాధ్యాయులకు.. విద్యార్థుల ఆరోగ్యం, చదువు, గ్రంథాలయం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడానికి నేషనల్ ఇనిషియేటివ్‌ఫర్ స్కూల్స్ హెడ్స్, టీచర్స్ హోలిస్టిక్ అడ్వాన్స్ అడ్వాన్స్‌మెంట్ (నిష్ఠా) కార్యక్రమం కొద్దిరోజులుగా పుదుచ్చేరి విద్యా శాఖ ఆధ్వర్యంలో యానాంలోని ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్నారు.

**215 మంది ఉపాధ్యాయులకు శిక్షణ**

దేశ విద్యా రంగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వారిలో వివిధ నైపుణ్యాలు, మెరుగైన బోధనా పద్ధతులు తదితర అంశాలతో నూతన విద్యా విధానాన్ని రూపొందించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, యానాంను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. దీంతో స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో కొద్ది రోజులుగా రెండు విడతలుగా ప్రభుత్వ పాఠశాలల్లోని 215 మంది ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారని ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, డెలిగేట్ టు డీఎస్ఈ కాలే సాయినాథ్ తెలిపారు.

**తొలుత ఎన్ఆర్‌జీ, కీ రిసోర్స్‌పర్సన్లకు..**

నేషనల్ రిసోర్స్‌పర్సన్స్ ఆధ్వర్యంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్లు, కీ రిసోర్స్ పర్సన్లకు శిక్షణను ఇప్పటికే ఢిల్లీలో ఇచ్చారు. ఈ శిక్షణకు యానాం నుంచి పంపన లక్ష్మణ ప్రవీణ్, నున్న సురేష్ కుమార్, పెనల జయరామయ్య, చెల్లపిల్ల వెంకట సత్యశ్రీరామ్, కడియం సుబ్బారావు, వర్ధినీడి వెంకట కృష్ణమోహన్ ఈ శిక్షణ పొందారు. వీరందరూ తిరిగి యానాంలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తాయని పలువురు టీచర్లు అభిప్రాయపడుతున్నారు.

**ఆలోచింపజేసిన వివిధ శిక్షణ అంశాలు**

చదువు, ఆరోగ్యం, గ్రంథాలయం, పర్యావరణ పరిరక్షణ, యువజన క్లబ్బుల ఏర్పాటు, పెరటి తోటల పెంపకం, నాయకత్వ లక్షణాలు, కృత్రిమ మేథ, పర్యావరణం, ఫోక్సో చట్టం, దివ్యాంగ విద్యార్థుల హక్కులతో పాటు లైంగిక వేధింపులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, పాటల ద్వారా అభ్యసనం ప్రదర్శించారు.

**శిక్షణ ఎంతో ఉపయోగం**

నిష్ఠా శిక్షణ కార్యక్రమం ద్వారా మెరుగైన బోధన పద్ధతులు, మెలకువలపై ఇస్తున్న శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగం. విద్యార్థుల్లో ప్రవర్తనలో మార్పులు వస్తాయి.

**- కమిడి ప్రభాకర్, ఎస్ఎస్ఏ, ఏడీపీసీ, యానాం**

## కార్తిక స్నానాలకు ఏర్పాట్లు

యానాం: కార్తిక మాసం సందర్భంగా గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలకు ఆచరించడానికి భక్తుల కోసం మున్సిపాలిటీ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మంగళవారం నుంచి స్నానాలకు వచ్చే ముఖ్యంగా మహిళలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్థానిక గౌతమి గోదావరి పుష్కర ఘాట్ వద్ద కుళాయిలను ఏర్పాటు చేశారు. అక్కడ విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు



యానాంలో పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కుళాయిలు



యానాంలో పుష్కర ఘాట్‌ను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మున్సిపల్ కమిషనర్ సరోజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గూటం రాంబాబు తెలిపారు. కనకాలపేట పుష్కర ఘాట్ వద్ద మట్టిని తొలగించామన్నారు. మంగళవారం తెల్లవారు ఘామున నుంచి మున్సిపల్ యంత్రాంగం పుష్కర ఘాట్‌ల వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ధ్రువపత్రాల పరిశీలనకు పుదుచ్చేరి కలెక్టర్ ఆదేశం

యానాం: రెవెన్యూ శాఖ ద్వారా జారీ చేస్తున్న నేటివిటీ, నివాస, కుల తదితర ధ్రువీకరణ పత్రాలను సంబంధిత ఏరియా డిప్యూటీ కలెక్టర్ తప్పనిసరిగా పరిశీలించాలని పుదుచ్చేరి కలెక్టర్ టి.అరుణ్ ఆదేశించారు. ఇటీవల జారీ చేస్తున్న వివిధ ధ్రువపత్రాల కచ్చితత్వంపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, ఈమేరకు ఆయన సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ధ్రువీకరణ పత్రాలపై అనుమానాలు వస్తే వాటిని రద్దు చేయాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని సంబంధిత తాలుకా అధారిటీలు పరిశీలన చేయాలని సూచించారు. ముఖ్యంగా జిప్‌మెర్, సెంటాక్ తదితర మెడికల్ అడ్మిషన్లు కోసం నివాస సర్టిఫికెట్ల కోసం ఇక్కడ అర్జీలు పెడుతున్నారని, వీరిలో చాలామందికి రెండు చోట్ల ధ్రువీకరణ పత్రాలు ఉంటున్నాయని అన్నారు. అలాంటి వారిపై ముఖ్యంగా సంబంధిత అభ్యర్థి, తల్లిదండ్రులపై డిప్యూటీ కలెక్టర్లు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలిసారి 2005లో సెంటాక్ ద్వారా ఎంబీబీఎస్ అడ్మిషన్లకు నకిలీ సర్టిఫికెట్ల స్కామ్ వెలుగులోకి వచ్చింది. సుమారు ఆరుగురు తమిళనాడు విద్యార్థులు సెంటాక్ అడ్మిషన్స్ కోసం ఫేక్ నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించారు.

2 9 OCT 2019.

**యానాం పట్టణంలో..**

యానాం: పుదుచ్చేరి పరిధిలోని యానాం పట్టణం లో దీపావళి వేడుకలను ప్రజలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. పట్టణ పరిధిలో 31 బాణసంచా హోల్‌సేల్ షాపులకు అనుమతి ఇచ్చారు. కొనుగోలుదారులతో షాపులు కిటకిటలాడాయి. తాళ్లరేవు, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కొనుగోలుదారుల తరలిరావడంతో యానాం నుంచి నీలపల్లి చెక్‌పోస్టు వరకు ట్రాఫిక్ స్తంభించింది. పాతబస్టాండ్, కె.జంక్షన్, త్యాగరాజ వీధి, చింతావారి వీధి, సుబ్రహ్మణ్య భారతి వీధి తదితర ప్రాంతాల్లో బాణసంచాను

# యానాంలో 'విజిలెన్స్' అవగాహన ర్యాలీ

యానాం: విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో క్రీడాకారులు, స్థానికులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంసీ బాలయోగి క్రీడా మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలో పలు వీధుల మీదుగా సాగింది. అవినీతికి వ్యతిరేకంగా అందరినీ చైతన్యవంతులను చేయాలన్న ఉద్దేశంతో వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అవినీతికి వ్యతిరేకంగా క్రీడాకారులు ప్రతిజ్ఞ చేశారు.



**విజిలెన్స్ అవేర్‌నెస్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, క్రీడాకారులు**

ర్యాలీలో సాయ్ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 1న పుదుచ్చేరి విమోచన దినోత్సవం

యానాం: పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 1వ తేదీ శుక్రవారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పరిపాలనాధికారి శివరాజ్ మీనా మంగళవారం తెలిపారు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పోలీస్ దళాల కవాతు నిర్వహిస్తారని తెలిపారు. విమోచన దినోత్సవాన్ని పుర స్కరించుకుని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తారని తెలిపారు.